ఆరోగ్యం వైపు అడుగులు

- ప్రజల్లో పెరుగుతున్న స్పృహ
- రోడ్లు, మైదానాల్లో వాకర్ల సందడి
- నిత్యం వ్యాయామంతో రోగాలు దూరం
- ఆదర్శంగా నిలుస్తున్న యోగా వారియర్స్


ఆసనాలు వేస్తున్న యోగా వారియర్స్

బాన్సువాడ : సంపూర్ణ ఆరోగ్యానికి నిత్యం నడక, వ్యాయామం, యోగా, ధ్యానం తప్పనిసరి. ప్రధానంగా అజీర్తి నుంచి అర్థరైటిస్ వరకు, రక్త పోటు నుంచి గుండెపోటు వరకు, మధుమేహం నుంచి మానసిక సమస్యల వరకు ఏదైనా దరి చేరకుండా ఉండాలంటే రోజూ వ్యాయామం, యోగా చేయాలి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్షణం తీరిక లేకుండా ఉద్యోగాల్లో తలమునకలయ్యే వారు శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు వ్యాయామాన్ని తమ జీవన విధానంలో భాగంగా చేసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రజల్లోనూ ఆరోగ్య స్పృహ పెరిగింది. తెల్లవారుజామునే లేచి యువకులు రోడ్ల వెంబడి పరుగులు పెడుతుండ గా.. పెద్ద వారు నడక సాగిస్తున్నారు. అనంతరం మైదానాలకు వెళ్లి కాసేపు సేదతీరి వ్యాయామం, యోగాసనాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటు న్నారు. రోజురోజుకూ పట్టణాలు, గ్రామాల్లో వాకర్ల సంఖ్య పెరుగుతుండడంతో రోడ్లు, మైదానాలు ఉదయం పూట సందడిగా కనిపిస్తున్నాయి.

యోగా వారియర్స్‌గా...

బాన్సువాడ పట్టణానికి చెందిన కొందరు ఉపాధ్యా యులు రెండేళ్ల క్రితం యోగా వారియర్స్‌గా ఏర్పా టయ్యారు. ఈ వారియర్స్‌లో సుమారు 40 మంది సభ్యులు ఉన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపు తున్నారు. నిత్యం క్రమం తప్పకుండా ఉదయాన్నే మైదానానికి వెళ్లి వాకింగ్, యోగా, ధ్యానం, సూర్య నమస్కారాలు చేస్తున్నారు.


బాన్సువాడలో యోగా వారియర్స్ సభ్యులు

ప్రశాంతంగా ఉంటుంది



రెండేళ్లుగా వాకింగ్ చేస్తున్నాం. రోజూ వాకింగ్, యోగా చేయడం వల్ల ప్రశాంతంగా ఉంటుంది. నాతో పాటు అందరికీ ఆరోగ్యం ఉండాలనే మంచి ఉద్దేశంతో యోగా వారియర్స్ ఏర్పాటు చేశాం.

–నరహరి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, బాన్సువాడ

విహారయాత్రలకు వెళ్తున్నాం



వాకింగ్ చేయడం వల్ల రోజంతా చురుకుగా ఉంటుంది. రోజుకు 5 కిలోమీటర్లు వాకింగ్ చేస్తున్నాం. అందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం బాగుంటుంది. గ్రూపు ఆధ్వర్యంలో అప్పుడప్పుడు మానసిక ప్రశాంతత కోసం విహార యాత్రలకు వెళ్తున్నాం.

– మంద ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయుడు, బాన్సువాడ

బరువు అదుపులో ఉంటుంది



రోజూ వాకింగ్ చేయడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. ఆహారం కూడా మితంగా తీసుకోవాలి. దీనివల్ల ఎలాంటి రుగ్మతలు రావు. పరగడుపున గోరువెచ్చని నీళ్లు తాగిన తర్వాత వాకింగ్ మొదలుపెడతాను. ప్రస్తుతం ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. రోజు వాకింగ్ చేయడం వల్ల ఉల్లాసంగా జీవిస్తున్నా.

–దాసరి రవీందర్, ఉపాధ్యాయుడు, బాన్సువాడ

క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరం



పిట్లం(జుక్కల్): మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ప్రభుత్వాస్పత్రి నేత్ర వైద్య సహాయాధికారి హరికిషన్ రావు తెలిపారు. అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మోతిబిందు నిర్ధారణ, కంటి పరీక్షలను చేస్తున్నామన్నారు. అవసరమైన వారికి ఆపరేషన్ నిమిత్తం బాన్సువాడకు పంపిస్తామన్నారు. మండలంలోని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

యాడారంలో చిన్నారులకు..



బీబీపేట: యాడారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతే కాకుండా గర్భిణులకు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని, తల్లితో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం కూడా కాపాడుకోవాలని అన్నారు. వైద్య సిబ్బంది జ్యోత్స్న, ప్రభావతి, రాధిక పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల తనిఖీ



బాన్సువాడ: పట్టణంలోని మినీ స్టేడియం, పాత బాన్సువాడ చావిడిలో ఉన్న బస్తీ దవాఖానాలను శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ప్రతీ రోజు బస్తీ దవాఖానాకు వచ్చే రోగుల వివరాలు, ఇన్ పేషంట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. దవాఖానాలో అందుబాటులో ఉన్న మందుల గురించి వైద్య సిబ్బందిని అడిగారు. ఆమె వెంట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దయానంద్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

సామాజిక కార్యకర్త పవన్ మృతి

బాన్సువాడ రూరల్: బోర్లం గ్రామానికి చెందిన సదా పవన్ ముదిరాజ్ శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో బాన్సువాడ నుంచి నిజామాబాద్ తరలిస్తుండగా మృతి చెందారు. పవన్ పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించేవారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అనారోగ్యంతో రిటైర్డ్ లెక్చరర్..

దోమకొండ: లింగుపల్లి గ్రామానికి చెందిన రిటైర్డు లెక్చరర్ పోగుల సిద్ధరాములు(66) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఆయన సోషల్ వెల్ఫేర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. కొంతకాలంగా డయాలసిస్‌తో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య ముగ్గురు కుమారులున్నారు.

రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక



దోమకొండ: అంచనూరు గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా పందిరి భూపతి రెడ్డి ఎన్నికయ్యారు. గ్రామ మాజీ సర్పంచ్ బురాని స్వామిగౌడ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పందిరి సంజీవరెడ్డి, నాయకులు గుండు గోపి, నవీన్‌రెడ్డి, మెట్టు శంకర్‌గౌడ్, జొన్నల బాలరాజు, జొన్నల లింగం, బురాని శ్రీనివాస్‌గౌడ్ తదితరులు సన్మానించారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కామారెడ్డి అర్బన్: పేద మహిళలకు సాధికారత కోసం సామాజిక బాధ్యతగా బీజీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్, రోటరీ జూబ్లీ హిల్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కామారెడ్డి రోటరీ క్లబ్‌కు అందించిన 20 కుట్టు మిషన్లను శుక్రవారం స్థానిక రోటరీ ఆడిటోరియంలో రోటరీ డిప్యూటీ గవర్నర్ ఆకుల అశోక్ పంపిణీ చేశారు. అనంతరం కామారెడ్డి రోటరీ అధ్యక్షుడు పి.రాజనర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో క్లబ్ ప్రాముఖ్యత, చేస్తున్న సామాజిక సేవలను డిప్యూటీ గవర్నర్ వివరించారు. సేవా భావం ఉన్నవారు రోటరీలో సభ్యులుగా చేరాలని కోరారు. ప్రోగ్రాం చైర్మన్ పి.సత్యం, మాజీ సహాయ గవర్నర్ శ్రీశైలం, రోటరీ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సబ్బని కృష్ణహరి, ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- సీడీపీవో సౌభాగ్యం
- సాక్షి కథనానికి స్పందన



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని ఫకీరా నాయక్ తండాలో గల అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీడీపీవో సౌభాగ్యం, సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్‌లో సూచించారు. ఈ నెల 11న సాక్షిలో వచ్చిన 'ఊడిపడుతున్న పెచ్చులు' కథనానికి ఆమె స్పందించి శుక్రవారం అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ సెంటర్‌ను వెంటనే మరో భవనంలోకి మార్చాలని సూపర్‌వైజర్ వాణికి ఆదేశించారు. మరో భవనం లేక ఇబ్బందిగా ఉందని సూపర్‌వైజర్, సీడీపీవో దృష్టికి తీసుకెళ్లారు.అంగన్వాడి టీచర్ తులసి, గౌరమ్మ, గ్రామస్తులు ఉన్నారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక


బాన్సువాడలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. బాన్సువాడ పట్టణం, బాన్సువాడ గ్రామీణం, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించారు. ట్రాన్స్‌కో అధికారులు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని క్షేత్రసిబ్బందికి సూచించారు. ఎస్ఈ శ్రావణ్‌కుమార్, డీఈ ప్రభాకర్ రావు, ఏడీఈ సంజీవ్‌రావు, ఏఈ అనిల్‌కుమార్ తదిరతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం


అవగాహన కల్పిస్తున్న అధికారిణి కవిత

మద్నూర్(జుక్కల్): అందరం కలిసి రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని ఆర్టీవో అధికారిణి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కవిత సూచించారు. మండలంలోని సలాబత్‌పూర్ వద్ద శుక్రవారం జాతీయ రహదారి వారోత్సవాల సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నియమాలు పాటించాలని అన్నారు. సంవత్సరానికి ఆరు లక్షల మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారని, వాహనాదారులు ట్రాఫిక్ నియమాల గురించి తప్పకుండా తెలుసుకోవాలని చెప్పారు. హెడ్ కానిస్టేబుల్ నర్సింగ్‌రావ్, సిబ్బంది ఉన్నారు.


లింగంపేట అంబేడ్కర్ చౌరస్తాలో కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

రోడ్డు భద్రతపై అవగాహన

లింగంపేట(ఎల్లారెడ్డి): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు శుక్రవారం లింగంపేట అంబేడ్కర్ చౌరస్తాలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, అతివేగం ప్రమాదకరమని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ప్రజలకు ఆట పాటలతో అవగాహన కల్పించారు. కళాకారులు మహేందర్, విఠల్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, దేవయ్య, శిల్ప, సవిత, దివ్య, రమేశ్‌రావు, లక్ష్మినారాయణ, తిరుపతి, నరేష్, పోశెట్టి, లత తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికీ చెప్పొద్దు


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మేనేజర్ సందీప్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బొమ్మన్‌దేవ్‌పల్లిలో శుక్రవారం దుర్కి కెనెరా బ్యాంకు మేనేజర్ సందీప్ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ బ్యాంకు ఖాతా వివరాలను ఎవ్వరికి చెప్పొద్దన్నారు. బ్యాంకు అధికారులు కూడా ఫోన్ ద్వారా వివరాలను తెలుసుకోవడానికి కాల్ చేయరని గుర్తించాలన్నారు. నగదు తీసుకు వెళ్లే సమయంలో జాగ్రత్తలను పాటించాలన్నారు. అనంతరం స్వచ్ఛంద సేవా సంస్థ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, సీసీ సుజాత, గ్రామస్తులు పవన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో ఇంపాక్ట్

వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం

కామారెడ్డి అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ కామారెడ్డి(వివేకానంద) ఆధ్వర్యంలో ఈనెల 20, 21 తేదీల్లో స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యక్తిత్వ వికాస సంస్థ, విద్యార్థులకు ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్లబ్ చైర్మన్ చిలివేరి మారుతి, ప్రతినిధులు డి.హరికృష్ణ, ఎం.రాజశేఖర్, ఉప్పల హరిధర్, కైలాస్ భూపేష్‌లు తెలిపారు. 20న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇంటర్ విద్యార్థులకు, 21న ఉదయం నుంచి సాయంత్రం వరకు డిగ్రీ, పీజీ విద్యార్థులు, ఉద్యోగుల, వ్యాపారులు, తల్లిదండ్రులకు శిక్షణ ఉంటుందని లయన్స్ ప్రతినిధులు వివరించారు.

ఎస్సైగా పదోన్నతి



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్ ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వెంకట్ రావుకు ఎస్సైగా పదోన్నతి రావడంతో ఎస్సై లావణ్య అభినందించారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సిబ్బంది సమావేశం ఏర్పాటు చేసి ఆయన్ను సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిబ్బంది గంగారాం, బుజ్జి, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఫెన్సింగ్ పనుల ప్రారంభం



బీబీపేట : ఎన్నికల ముందు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మండలంలోని ఇస్సానగర్‌లో గౌడ సంఘం ఎల్లమ్మ గుడి చుట్టూ టైగర్ ఫెన్సింగ్ పనులను చేయిస్తున్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క రవీందర్, మండల ప్రధానకార్యదర్శి అల్లం ప్రవీణ్, మండల ఉపాధ్యక్షులు సంతోష్ గౌడ్, రవీందర్, శ్రీశైలం, వంశీగౌడ్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



మాచారెడ్డి : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని మాచారెడ్డి క్లస్టర్ సీఆర్పీ దేవసంజీవ్ సూచించారు. శుక్రవారం అక్కాపూర్ రోడ్డులో ఉన్న ఇటుక బట్టీలో ఆరుగురు బడీడు పిల్లలను గుర్తించారు. వారితో పని చేయిస్తే శిక్షార్హులవుతారని సీఆర్పీ హెచ్చరించారు. వారిని బడిలో చేర్పించాలని సూచించారు.

లింగంపేట పరిధిలో పిల్లల గుర్తింపు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని ముస్తాపూర్, శెట్పల్లి, లింగంపేట, తదితర గ్రామాల్లో శుక్రవారం బడి మధ్యలో మానిన విద్యార్థుల సర్వే నిర్వహించినట్లు మండల విద్యాధికారి షౌకత్‌అలీ తెలిపారు. ఈ సందర్భంగా బడికి జూన్ నుంచి వెళ్లకుండా ఇంటి వద్ద ఉన్న పిల్లలను గుర్తించారు. పిల్లల తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకత గురించి అవగాహన కల్పించి బడిలో చేర్పించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సీఆర్పీలు గంగాధర్, రాజు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : రైతు భరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు సూచించారు. శుక్రవారం వడ్లం గ్రామంలో అధికారులు నిర్వహిస్తున్న రైతు భరోసా సర్వేను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. మండలంలో బీడు భూములు, సాగు చేస్తున్న భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. గత రికార్డుల ఆధారంగా గుర్తించి వివరాలను సమర్పించాలన్నారు. మండల ప్రత్యేక అధికారి కిషన్, తహసీల్దార్ దశరథ్, మండల వ్యవసాయ అధికారి కిషన్, ఏఈవో రూప, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఆదాయం పెంపునకు కృషి


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ ధర్మగోని లక్ష్మి

కామారెడ్డి రూరల్: కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) ఆదాయం పెంపునకు కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ధర్మగోని లక్ష్మీ రాజాగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన పాలకవర్గం ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వసలహాదారు షబ్బీర్‌అలీలకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మార్కెట్ కమిటీ ఆవరణలో చేపట్టే అభివృద్ధి పనులపై మాట్లాడారు. రాబోయే రోజుల్లో మార్కెట్ కమిటీ ఆదాయం పెంచుకోవడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, ఏఎంసీ వైస్ చైర్మన్ మిన్కూరి బ్రహ్మానందరెడ్డి, డైరెక్టర్లు, తదితరులున్నారు.

'గ్రంథాలయాల అభివృద్ధికి ముందుకు రావాలి'


చంద్రకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంఘం ప్రతినిధులు

భిక్కనూరు: గ్రంథాలయాలు ప్రజలకు ఎంతగానో విజ్ఞానాన్ని అందిస్తాయని వాటి అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిప్పాపూర్‌లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని, దాతలు ముందుకు వస్తే తమ సంస్థ మరింత చేయూతను అందిస్తుందన్నారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుంట లింగారెడ్డి, ప్రతినిధులు హరిశ్చంద్రారెడ్డి, బీంరెడ్డి, దుర్గారెడ్డి, గణేష్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, నర్సారెడ్డి, సురేందర్‌రెడ్డి, బాపురెడ్డి, రాజిరెడ్డిలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఎల్లారెడ్డి : అజాంబాద్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురుమ సాయిబాబా, నాయకులు వెంకట్రాంరెడ్డి, సామెల్, గంగారెడ్డి పనులను ప్రారంభించారు.

ఆధ్యాత్మికం..

సత్యసాయి భక్తుల ఇళ్లలో భజన కార్యక్రమాలు

కామారెడ్డి అర్బన్: పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా కామారెడ్డి సెంటర్ ఆధ్వర్యంలో వంద మంది సత్యసాయి భక్తుల ఇళ్లలో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ లింబాద్రి, ప్రతినిధి భాస్కర శర్మలు తెలిపారు. వంద భజన కార్యక్రమాలు అక్టోబర్ నెలవరకు కొనసాగుతాయని, ఆయా రోజుల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని లింబాద్రి, భాస్కరశర్మలు కోరారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీసేవ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమాత దివ్యసమాధి, ప్రతిమ, చిత్రపటం, పాదుకలను రకరకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలుగ్రామాలకు చెందిన భక్తులు వచ్చి ఈపల్లకీ సేవలో పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు



కామారెడ్డి రూరల్ : దేవునిపల్లి శివాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు శశికాంత్‌శర్మ, శ్రీనివాస్‌రావుల ఆధ్వర్యంలో స్వామివారిని అలంకరించి ప్రత్యేక అభిషేకాలు చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు శివ దీక్షలు శుక్రవారం చేపట్టారు. 41 రోజులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి శివరాత్రి రోజున దీక్షలను విరమిస్తారు. శివస్వాములకు ఈ నెల 17 నుంచి శివరాత్రి వరకు దేవునిపల్లి శివాలయంలో నిత్యం భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు శివభిక్ష కమిటీ తెలిపింది.

క్యాలెండర్ల ఆవిష్కరణ..

స.హ.చట్ట పరిరక్షణ కమిటీ క్యాలెండర్..



కామారెడ్డి అర్బన్: సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జిల్లా క్యాలెండర్‌ను శుక్రవారం కామారెడ్డి ఏఎస్పీ చైతన్యారెడ్డి ఆవిష్కరించారు. స.హ. చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాజన్న, జోనల్ అధ్యక్షుడు సిర్నాపల్లి ప్రదీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు శివపూజ లింబయ్య, బాధ్యులు ఎంపీ భాస్కర్, షబానా బేగం తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ తెలంగాణ క్యాలెండర్..



కామారెడ్డి అర్బన్: పీఆర్‌టీయూ తెలంగాణ క్యాలెండర్‌ను డీఈవో ఎస్.రాజు శుక్రవారం ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంబీర్ మనోహర్‌రావు, జె.లక్ష్మీరాజం, జిల్లా, రాష్ట్ర బాధ్యులు గిరి, ఆనంద్, శ్రీధర్ రావు, సురేందర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం..



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం కామారెడ్డి జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం తెలిపారు. సంఘం రాష్ట్ర కౌన్సిలర్ ఎన్. లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి జెట్టి విజయ్ కుమార్, శ్రీధర్, రమేష్, వెంకట స్వామి, సరిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.